ప్రజాశక్తి

గురువారం 31 అక్టోబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

విద్యుత్ భారాల ఉపసంహరణకు

ఐక్య ఉద్యమాలు

- టాక్స్ పేయర్స్ అసోసియేషన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం రౌండ్‌టేబుల్ పిలుపు
- విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, సర్దుబాటు విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని తీర్మానం
- మంత్రికి, సిఎండికి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయం
- రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు ఐక్యవేదిక కమిటీ ఏర్పాటు

వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో

క్రక్స్ బయోటెక్‌లో సిఐడి సోదాలు

ప్రజాశక్తి- నందిగామ

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం పెద్దవరం క్రక్స్ బయోటెక్ ఫ్యాక్టరీలో బుధవారం సిఐడి అధికారులు సోదాలు నిర్వహించారు. క్రక్స్ బయోటెక్ ఫ్యాక్టరీ నుండి మద్యం తయారీకి వినియోగించే స్పిరిట్‌ను తయారు చేస్తారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి సిఐడి అధికారులు సోదాలు కొనసాగించారు. పలు రికార్డులను పరిశీలించారు. గత వైసిపి ప్రభుత్వంలో మద్యం తయారీకి సంబంధించిన పలు పరిశ్రమల నుండి అవకతవకలు జరిగాయని పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మీడియాను లోనికి అనుమతించలేదు.

నందిగామ మండలం పెద్దవరంలోని క్రక్స్ బయోటెక్ ఫ్యాక్టరీ

లక్ష్మణరావు పరిచయ సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు

ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉమ్మడి గుంటూరు - కృష్ణా జిల్లాల శాసన మండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా కె.ఎస్.లక్ష్మణరావు (కలగర సాయి లక్ష్మణరావు) పోటీచేస్తున్నారు. విజయవాడలోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను పిడిఎఫ్ అభ్యర్థిగా పరిచయం చేశారు. 2025 మార్చిలో కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మణరావుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయి. 2007 నుండి రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, అంగన్వాడీలు, విద్యార్థులు, యువజనులు, వివిధ సామాజిక వర్గాల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. బయట జరిగే అనేక ప్రజా ఉద్యమాలకు మద్దతునిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంఎల్‌సిగా ఉన్న ఆయన గుంటూరులోని హిందూ కళాశాలలో రాజనీతిశాస్త్రంలో లెక్చరర్‌గా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి 2007లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల్లోనూ ఇదే నియోజకవర్గం నుండి ఎంఎల్‌సిగా గెలుపొందారు. ఆయన 2007 మార్చి 26 నుండి 2015 మార్చి 25 వరకూ ఆయన రెండు దఫాలు ఎంఎల్‌సిగా ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఇదే నియోజకవర్గానికి 2015 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019లో ఉమ్మడి గుంటూరు-కృష్ణాజిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఎంఎల్‌సిగా పోటీ చేసి 68,120 ఓట్ల మెజారిటీతో తిరిగి ఎన్నికయ్యారు. 2019 మార్చి 27న ఆయన ఎంఎల్‌సిగా బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మచిలీపట్నం -విజయవాడ జాతీయ రహదారి (65)పై పామర్రు మండలం కంచర్లవానిపురం వద్ద టిప్పర్ ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో రోడ్డు దాటుతున్న ఇద్దరు మరణించారు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడ్లవల్లేరు మండలం అంగలూరు కొత్తపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (47), రహ్మాన్ బేగ్ (36) జాతీయ రహదారిపక్కన పామర్రు కంచర్లపాలెం వద్ద ఉన్న రైస్ మిల్లు మరమ్మతు పనులకు వెళ్లారు. రైస్ మిల్లు వైపు నుంచి జాతీయ రహదారి డివైడర్ దాటి రోడ్డుకు మరోవైపున ఉన్న చెరువు వద్దకు మూత్ర విసర్జనకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో మచిలీపట్నం నుంచి వస్తున్న టిప్పర్ వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు, రహ్మాన్ బేగ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాలను గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ పామర్రు పోలీసుస్టేషన్లో లొంగిపోయాడు. ఈ ఘటనపై పామర్రు ఎస్ఐ సిహెచ్ అవినాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.18 కోట్లు

- విఎంసి స్థాయి సంఘ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని రామలింగేశ్వర్ నగర్‌లోని 10 ఎంఎల్‌డి (మిలియన్ లీడర్స్ ఫర్ డే) సీవరేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ (ఎస్‌టిపి) దుర్వాసన నియంత్రించే చర్యలకు రూ.8 కోట్లు కేటాయిస్తూ విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘ సమావేశం తీర్మానించింది. అలాగే నగరపాలక సంస్థ వర్క్స్ డివిజన్ -2 (సర్కిల్-2) పరిధిలో పరిపాలనా ఆమోదం పొంది, నామినేషన్ పద్ధతిపై చేపట్టిన అత్యవసరమైన 25 పనులకు సంబంధించిన అంశాన్ని వాయిదా వేసింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం విఎంసి స్థాయి సంఘ సమావేశం జరిగింది. అజెండాలోని పది అంశాల్లో ఒక అంశం మినహా అన్ని అంశాలను నామమాత్రంగా చర్చించి, వాటిని ఆమోదించింది. 2024-25లో ఐదు లక్షల రూపాయలలోపు నామినేషన్ పద్ధతిపై చేపట్టిన అత్యవసరమైన 25 పనుల అంశాన్ని వాయిదా వేసింది. వర్క్స్ డివిజన్-3లో (సర్కిల్-3) రూ.6 కోట్ల అంచనా విలువ కలిగిన 151 పనులకు సంబంధించి నామినేషన్ పనులకు సంబంధించి నెంబర్ 44కు బిల్లు చెల్లింపు నిలుపుదల చేసింది. మిగిలిన పనులను ఆమోదించింది. నిలుపుదల చేసిన పనుల తాలూకు పూర్తి వివరాలను వచ్చే సమావేశానికి తీసుకొచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. నగరంలోని ఆరు రెసిడెన్సియల్ వెల్ఫేర్ కాలనీల్లో 50 శాతం కంట్రిబ్యూషన్ చెల్లింపు పద్ధతిపై 19 మంది పారిశుధ్య కార్మికులను భర్తీ చేసుకునే అంశాన్ని ఆమోదిస్తూ తీర్మానించింది. ఆర్‌డబ్ల్యుఎ 50 శాతం, మిగిలిన 50 శాతం విఎంసి కార్మికుల వేతనాలు భరించే విధంగా, విఎంసి జనరల్ ఫండ్ నుంచి చెల్లించడానికి ఆమోదం తెలిపింది. విఎంసి వాటా ప్రకారం నెలకు రూ.1.99 లక్షలు, అలాగే ఏడాదికి రూ.23.94 లక్షల మేర జనరల్ ఫండ్‌నుంచి మంజూరు చేస్తూ తీర్మానించింది. ఈ సమావేశంలో పలువురు స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

కానరాని పండుగ సందడి

ఆకాశంలో టపాసులు, నిత్యావసరాల ధరలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

దీపావళి కళతప్పింది. టపాసుల వెలుగులు, మోతలు పరిమితమయ్యాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది పండగ సందడి చప్పపడింది. ఇటీవల వరదలు, భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుడమేరు, కృష్ణానదుల వరదలకు ప్రజాజీవనం అస్తవ్యస్తమయ్యింది. ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోపక్క నిత్యావసరాలతోపాటు పండుగకు ఉపయోగించే టపాసుల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే పట్టణాలు, పల్లెల్లో పండగ వాతావరణం కనిపించడం లేదు. పండగను పురస్కరించుకుని జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, కూడలి ప్రాంత గ్రామాల్లో వ్యాపారులు పెద్ద సంఖ్యలో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. స్టాండర్డ్ కంపెనీ టపాసులు ఎంఆర్‌పి ధరలు ఈ ఏడాది భారీగా పెరిగాయి. వాటిపై 60 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు దుకాణాల యజమానులు చెబుతున్నారు. అయితే గతేడాది రూ.3,200కు కొనుగోలు చేసిన టపాసులకు ఈ ఏడాది రూ.5 వేలకుపైగా వెచ్చించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. గత ఏడాది రూ.300 ఉన్న కాకరపువ్వొత్తుల బాక్స్ ఈఏడాది రూ.420, చిచ్చుబడ్డులు బాక్స్ రూ.400 నుంచి రూ. 500, గ్రీన్ కలర్ బాంబు బాక్స్ రూ.500 నుంచి రూ. 630 విక్రయిస్తున్నారు. రూ.500

చిచ్చుబుడ్డులు రూ.630, రూ.70 ఉన్న భూ చక్ర బాక్స్ రూ.100కు పెరిగాయి. ధరలు 30 శాతానికిపైగా పెరగంతో టపాసుల విక్రయాలు మందగించాయి. పండుగ ముందు రోజు సైతం టపాసులు మోతలు, కాంతులు నామమాత్రంగానే ఉన్నాయి. మరోపక్క ఇటీవల వచ్చిన వరదలు, భారీ వర్షాలకు లక్ష ఎకరాలకుపైగా పంట దెబ్బతింది. పంటకు పెట్టుబడి పెట్టిన రైతులు భారీగా నష్టపోయారు. మరోపక్క పండుగకు పప్పన్నం, పిండివంటలు భారమయ్యాయి. వాటి ధరలు పెరగడంతో టపాకాయలు, పిండి వంటలు, నూతన దుస్తులు తదితర ఖర్చులు పరిమితం చేసుకుంటున్నారు. మధ్యతరగతి సామాన్యులు, పేదలు తమ ఇళ్ల ఎదుట నాలుగు ప్రమిదలు, కొవ్వొత్తులు వెలిగించి పండుగను ముగించే పరిస్థితి కనిపిస్తోంది.

వెలుగుల పండుగ దీపావళి ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : తెలుగు ప్రజలందరికీ దీపావళి పండుగ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపి కేశినేని శివనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని, ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య, సురక్షితంగా... ఈ వెలుగుల పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నగర ప్రజలకు మేయర్, కమిషనర్ దీపావళి శుభాకాంక్షలు

దీపావళి సందర్భంగా నగర ప్రజలకు విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకొని దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని, హరిత బాణసంచా కాల్చుకోవాలని, వాతావరణ కాలుష్యాన్ని కాపాడాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలందరూ సంతోషకరంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వెలంపల్లి శుభాకాంక్షలు

దీపావళి పండుగ శుభ సందర్భంగా, మాజీ మంత్రి, వైసిపి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

1న హైకోర్టుకు సెలవు

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర హైకోర్టు, హైకోర్టు పరిపాలనా పరిధిలో పనిచేసే కార్యాలయాలకు నవంబరు 1వ తేదీన సెలవుగా ప్రకటిస్తున్నామని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఈనెల 18న చేసిన అభ్యర్థనను పరిశీలించిన అనంతరం హైకోర్టు, హైకోర్టు పరిపాలనా పరిధిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, హై కోర్టు మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ జుడీషియల్ అకాడమీలకు 1న సెలవుగా ప్రకటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 21న హైకోర్టు పనిదినంగా ప్రకటిస్తున్నామని తెలిపారు.

శానిటరీ సూపర్వైజర్‌కు సత్కారం

ప్రజాశక్తి - విజయవాడ

నగరపాలక సంస్థలు సానిటరీ సూపర్వైజర్ కే. రాఘవ నవ కిషోర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం వారు వేడుకలు నిర్వహించారు. సీఎంహెచ్ డాక్టర్ సురేష్ బాబు అధ్యక్షతన అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్ అతిథిగా సభను నిర్వహించి ఆయనను సత్కరించారు. ఈ సభలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి ఎస్ సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్ సితార సెంటర్ రామరాజు నగర్‌కు చెందిన చుక్కా నాగరాజు తన బైపాస్ సర్జరీ కోసం తక్షణ ఆర్థిక సాయం కోసం సీఎంఆర్ఎఫ్ కింద లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి)కి ఎంపి కేశినేని శివనాథ్ సాయంతో ఆర్జీ పెట్టుకున్నారు. మంజూరైన రూ.2.50 లక్షలను బుధవారం చుక్కా నాగరాజు కుమారుడు చుక్కా రాజ్ కుమార్‌కు ఎంపి కార్యాలయ సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో వో.ఎస్.డి వెంకటరత్నం, లైజనింగ్ ఆఫీసర్ వి.మోహనరావు, బాలినేని మోహనరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : మంత్రి నారాయణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తెలుగు జర్నలిస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని ఏపీ ఎన్‌జీవో హోంలో దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యతన్నారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన పాలన అందించడంలో పాత్రికేయుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సెంట్రల్ ఎంఎల్ఎ బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు ఎ.విద్యాసాగర్, వివి.ప్రసాద్, తెలుగు జర్నలిస్ట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలింజన్ గుర్తుకే ఓటేయండి

గుర్తింపు సంఘాల ఎన్నికల్లో నేతల ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ : రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ వారు బుధవారం వేగన్ డిపో. సిక్లైన్ ,ఆర్వో హెచ్ షెడ్, శ త్రు యాడ్ ఇతర డిపోలలో ప్రచారం నిర్వహించారు. రైలింగ్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. డివిజన్ ప్రెసిడెంట్ ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ కార్మిక హక్కులు పరిరక్షించుకోవాలంటే , ఎనిమిదవ వేతన సంఘం రావాలంటే, మహిళా కార్మికులకు 100 శాతం జీతంతో వెయ్యి రోజులు చైల్డ్ కేర్ లీవ్ రావాలంటే , రైలు ఇంజన్ కే ఓటు వేయాలనికే అభ్యర్థించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మర్రి రాఘవయ్య మాట్లాడుతూ రైల్వే కార్మికులకు ఎనలేని సేవలు అందిస్తున్నారని, ఆ సేవలను గుర్తించి రైలింజన్‌కి ఓటు వేయాలని తెలిపారు. బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్ మాట్లాడుతూ జోనల్ స్థాయి తో పాటు డివిజన్ స్థాయిలోనూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ కార్మికులకు అందుబాటులో ఉంటూ ఎంప్లాయిస్ సంఘ్ కార్మికులకు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆఫీస్ బ్యారర్లు ఫణి రాజ్ కుమార్ హైమావతి, మణికుమార్ మునికష్ణ ,సుబ్రహ్మణ్యం, సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అల్లం శెట్టి రమేష్, ఇంజనీరింగ్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎమ్మెస్ రావు కొయ్యరమణారెడ్డి, టికెట్ చెకింగ్ బ్రాంచ్ కార్యదర్శి బాలాజీ, శ్యామ్, మెడికల్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాసరావు,. తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలెట్ ఎబినేజర్‌కు నివాళి

దుండగుడి దాడిలో ఇటీవల దుర్మరణం పాలైన లోకో పైలెట్ ఎబినేజర్ కుటుంబానికి సికింద్రాబాద్ డివిజన్‌లో ఉన్న స్నేహితులు అండగా నిలిచారు. ఎబినేజర్ క్లాస్మేట్స్ ,స్నేహితులు అందరూ కలిసి కుటుంబానికి లక్ష ఇరవై వేల రూపాయలను అందజేశారు. బుధవారం సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వచ్చిన లోకో పైలెట్ విజయ్ కుమార్, ఆకుల సాయి రాము తదితరులు ఎబినేజర్ సతీమణి కి చెక్కును అందజేసి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఎబినేజర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు ధర్నాలో నేతల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, అందునా పని ప్రదేశాల్లో ఉద్యోగినులు, మహిళా కార్మికుల పట్ల లైంగిక వేధింపులకు అంతం లేకుండా పోతుందని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని, కోల్కతా అర్జికార్ హాస్పిటల్ డాక్టర్ అభయ హత్య, అత్యాచార కేసులో న్యాయం జరిపించాలని కోరుతూ ఐఎఫ్‌టియు ఇచ్చిన పిలుపు మేరకు విజయవాడ పియన్ బస్టాండ్ వద్ద ఇఫ్టు, పిఓడబ్లూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మహిళలు పని చేసే ఆఫీసులలో, సంస్థలలో, కర్మాగారాల్లో మహిళల భద్రతా కమిటీలు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కానీ ప్రభుత్వాలు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలపై అత్యాచారాలు మరింతగా పెరిగిపోతున్నాయని మగాళ్లను కఠినంగా శిక్షించాల్సిన చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ముని శంకర్, మహిళా సంఘం నాయకులు దుర్గ, రాధ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దని దేవీనగర్లో నిరసన

ప్రజాశక్తి - విజయవాడ

నగరంలోని దేవీనగర్ 8 వ రోడ్డులో ట్రెండ్ సెట్ మేడోస్ ఎదురుగా జనావాసాలా మధ్య బార్, వైన్ షాప్..ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం స్థానికులు నిరసన తెలిపారు. ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. ఆయన బుధవారం 43వ డివిజన్లో ఊర్మిళ నగర్, కబేళా పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించొద్దని, పారిశుధ్య కార్మికులు నిత్యం వారి పనులు వారు సంపూర్తిగా చేయాలని ఆదేశించారు. అధికారులు వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి సత్యనారాయణ, ఎమినిటీస్, శానిటరీ, ప్లానింగ్, సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్ర క ట న

IN THE COURT OF THE HON'BLE VII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
A.S. No. 36/2024

Between:-
Kunala Punna Rao... Appellant
AND
Municipal Corporation of Vijayawada & Others..
...Respondents

To,
5వ ప్రతివాది: అడుసుమిల్లి అవినాష్, తండ్రి బిపిన్ చంద్ర పాల్, డోరు నెం.43-3-18, కృష్ణ నగర్, వెంకటేశ్వరపురం, విజయవాడ.
8వ ప్రతివాది: వల్లభనేని లలిత కుమారి, భర్త రమేష్ బాబు, డోరు నెం.40-14-3/3, చంద్రమౌళిపురం, విజయవాడ.
9వ ప్రతివాది: అట్లూరి వేణుగోపాల్, తండ్రి మాధవరావు, ప్లాట్ నెం.12, ఆర్‌టిసి కాలనీ, పటమట, విజయవాడ.
12వ ప్రతివాది: షేక్ ఆయేషా, తండ్రి మున్నిఫ్ దస్తగిరి, ఫ్లాట్ నెం.5, 2వ ఫ్లోరు, గణేష్ అపార్ట్‌మెంట్, బృందావన్ కాలనీ, టిక్కిల్‌రోడ్డు, విజయవాడ.
ఈ నెంబరు అప్పీలు దావాలో **5,8,9 మరియు 12వ** ప్రతివాదుల నోటీసులు నిమిత్తం **26-11-2024**వ తారీఖున వాయిదా ఉన్నది. కనుక ఈ నెంబరులో పైన తెలిపిన ప్రతివాదులు స్వయంగా గానీ, లేదా ప్లీడరు గారి ద్వారాగానీ పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట **ఉదయం గం.10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షముగా శ్రీ కోర్టువారు తీర్మానింపగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా తేది: 26-11-2024
(శ్రీ కోర్టువారి అనుమతితో)
ఇట్లు
ఎం.డి.ఎన్.నాగేశ్వర గుప్త
అప్పీలుదారు తరపు న్యాయవాది, విజయవాడ

IN THE COURT OF THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT :: MAHABUBNAGAR
C.C.No. 50 of 2024

Between:
Smt. Sajjana Gandla Vaishnavi
...Complainant
And
M/s Leela Krishna Automobiles Pvt.Ltd,. and others ...Opposite Parties

NOTICE

To
1.M/s Leela Krishna Automobiles Pvt.Ltd,. a company regd.under companies Act, 1956, rep. by its MD beside AP Seeds Cor Prasadampadu, Vijayawada -5521108, Krishna Dist.
2.Subramanyam Maganti, M.D. M/s Leela Krishna Automobiles Pvt.Ltd,. regd. office at 5-110, NH-5, Beside AP Seeds Corp. Prasadampadu, Vijayawada. 5521108, Krishna Dist.
3.Venkata Srinivasa Maganti Director of M/s Leela Krishna Automobiles Pvt.Ltd,. regd. office at 5-110, NH-5, Beside AP Seeds Corp. Prasadampadu, Vijayawada. 5521108, Krishna Dist.
4.Madhusudhana Sarma Maganti, Director of M/s Leela Krishna Automobiles Pvt.Ltd,. regd. office at 5-110, NH-5, Beside AP Seeds Corp. Prasadampadu, Vijayawada. 5521108, Krishna Dist.

Take notice that the above case C.C. No.50/2024 filed by the complainant for deficiency of your services to supply the vehicle to the complainant even after receiving the sale consideration amount from the complainant and the said case is posted on 22-11-2024 for appearance of opposite parties 1 to 4 or in person or through an advocate, in case failed to appear before this Hon'ble Court on 22-11-2024 at 10:30 AM, the petition will be decided on merits.

"By the order of the Court"
T. Venkatarama Sharma,
T.Sreekar Chandra Sharma,
M.Chennaiah Goud & Chakravarthi
Advocates, Mahabubnagar.
Cell No. 9440360926, 8555968145

ఉచిత ఇసుక అమలుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఆయన జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక విధానం కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నిబంధన ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. రీచ్ల్లో ఇసుక తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లో జెసిబి, ప్రొక్లైన్ వంటి యంత్రాలను ఉపయోగించడానికి వీలులేదని, కేవలం మనుషులతో (మాన్యువల్) తవ్వకాలు చేపట్టే విధంగా చూడాలన్నారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించిన వారి యంత్రాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాన్యువల్ పద్ధతిలో ఇసుక తవ్వకాలకు స్థానికులకే అవకాశం కల్పించే విధంగా చూడాలన్నారు. నది కట్టకు ఎలాంటి హాని కలగకుండా ఉండేందుకు కట్ట నుంచి రెండు వందల మీటర్ల అవతల తవ్వకాలు జరిగే విధంగా చూడాలని, ఇందుకు గ్రామ మండల సర్వేయర్ల సహాయంతో స్థానిక తహసిల్దార్లు ఇసుక తవ్వకాల ప్రాంతాలలో మార్కింగు చేయాలన్నారు. అదేవిధంగా ఒకే ప్రాంతంలో అదే పనిగా నిరంతరంగా ఇసుక తవ్వి భారీ గుంటలు ఏర్పడటానికి అవకాశం లేకుండా చూడాలని సూచించారు. అవసరం మేరకే ఇసుకను తీసుకెళ్లాలని, అలాకాకుండా వ్యాపార ధోరణితో ట్రాక్టర్లతో ఎక్కడైనా ఇసుకను నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బి

సత్యనారాయణ, మచిలీపట్నం, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల అధికారులు కే స్వాతి, బీఎస్ హేలా షారోన్, మైన్స్ ఏడి శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ గంగయ్య పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలు సాధించాలి

జిల్లాలో వివిధ శాఖలలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వందరోజుల ప్రణాళిక లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. లక్ష్యాల సాధనకు ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. చెత్త నుండి సంపద కేంద్రాలు పటిష్టవంతంగా అమలులోకి తేవడానికి అప్రోచ్ రోడ్లు, వాటర్ విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు, చిన్న రిపేర్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలకు సంబంధించి నూరు శాతం విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఉపాధి హామీలో రోడ్లు పనులు పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు సంబంధించి త్వరగా బిల్స్ అప్లోడ్ చేస్తే డబ్బులు త్వరగా వస్తాయని కలెక్టర్ అధికారులకు సూచించారు. 148 అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పనకు నిధులు విడుదల కాగా పనులు సత్వరమే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వరదలకు సంబంధించి పంట నష్టాలపై సమీక్షిస్తూ జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించే విషయంలో కలెక్టర్ సమీక్షిస్తూ జిల్లాలో మొదటి విడత 37,765 మంది రైతులకు 56.70 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ, రెండో విడత 2294 మంది రైతులకు 3.21 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బందరు ఉయ్యూరు గుడివాడ ఆర్డీవోలు కే స్వాతి, షారోన్, జి బాలసుబ్రహ్మణ్యం, డిఎస్ఓ వి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చండి

డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునే విధానంలో లోటుపాట్లపై లోతుగా అధ్యయనం చేసి ఆటో వాలాలకు ఎంతవరకు ప్రయోజనకరమో పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. డీజిల్ ఆటోలను ఈవి వాహనాలుగా కన్వర్ట్ చేయడానికి అయ్యే వ్యయం, ప్రయోజనాలు తదితర అంశాలపై చెన్నై నుండి వచ్చిన కంపెనీ ప్రతినిధులు బుధవారం కలెక్టరేట్లో వారి ఆటోలను ప్రదర్శించి జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ రవాణా అధికారులకు వివరించారు. సాధారణంగా విద్యుత్తు వాహనాలు వల్ల తక్కువ వ్యయంతో ఎక్కువ మైలేజ్ వచ్చే అవకాశం ఉందని, విధానం సక్సెస్ అయితే ఆటోవాలాలకు తగిన అవగాహన కల్పించడం ద్వారా వారి జీవనోపాధి మెరుగు పరచడానికి వీలవుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి జి.మనీషా, మోటార్ వాహన ఇన్స్పెక్టర్లు టివిఎన్ సుబ్బారావు, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొని మినీ వ్యాన్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. ఎస్సై చావా సురేష్ కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన వల్లూరి కోట రామచంద్ర రావు (41) మినీ వ్యాన్లో కొబ్బరిబోండాల లోడ్ వేసుకుని విజయవాడ వెళు తుండగా మంగళవారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో పొట్టిపాడు టోల్గేట్ ముందు తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ తన లారీని అజాగ్రత్తగా రోడ్డుపైనే పార్క్ చేసి, ఎటువంటి సిగ్నల్స్ వేయకుండా వదిలేయడంతో అది గమనించని వల్లూరు కోట రామచంద్రరావు దగ్గరకు వచ్చేంతవరకు లారీని గమనించ పోవడంతో బ్రేక్ వేసినా తను వాహనం కంట్రోల్ కాలేక వెళ్లి లారీ వెనుక భాగానికి బలంగా ఢీ కొట్టింది. దాంతో మినీ వ్యాన్ క్యాబిన్ నుజ్జు నుజ్జు అయి కోట రామచంద్ర రావు అందులోనే ఇరుక్కుని తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే అక్కడ స్థానికులు పోలీసులు అతన్ని అతి కష్టం మీద బయటకు తీసి అంబులెన్స్ ద్వారా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని దీపావళి పండుగ సందర్భంగా మందు గుండు సామాగ్రి విక్రయించేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టపాకాయలు మందు గుండి సామాగ్రి విక్రయించడానికి ఘంటసాలలో రెండు షాపులు, దాలిపర్రులో ఒక షాపు, శ్రీకాకుళంలో ఒక షాపునకు అనుమతి ఉన్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మందు గుండు సామాగ్రి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందు గుండు సామాగ్రి షాపులు వద్ద విధిగా ఇసుక, నీళ్ల విధిగా దగ్గర ఉంచాలని ఎస్సై ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. **కోడూరు:** కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని సంత మార్కెట్ ప్రాంగణంలో ఎనిమిది టపాసుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కోడూరు మండలం తాసిల్దార్ బి.శ్రీను నాయక్ తెలిపారు. కోడూరు మండలం వ్యాప్తంగా అనుమతించిన టపాసులు విక్రయ కేంద్రాలలో తప్ప ఎక్కడ అమ్మకాలు కొనుగోలు జరగకూడదని ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. **మొవ్వ:** దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా, బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని షాపు యాజమానులని ఆదేశించారు. షాపుల వద్ద ఫైర్ సేఫ్టీ పాటించాలని, కూచిపూడి సెంటర్లోని ఓల్డ్ శిరీష థియేటర్ వద్ద స్థలంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాల ప్రాంతాన్ని పామర్రు సీఐ సుభాకర్, కూచిపూడి ఎస్సై ఎం. సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గన్నవరం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం పి.ఉమాదేవి బుధవారం తెలిపారు. గుడివాడ లో జరిగిన జిల్లా స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 14, 17 బాలబాలికల ఎంపికలకు హాజరైన గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల లో తొమ్మిదవ తరగతి చదువుతున్న జి.నాగ బాలాజీ, (అండర్-17) విభాగంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న యు. పండు బాబు (అండర్-14) విభాగంలో అసమాన క్రీడా నైపుణ్యం ప్రదర్శించారు. దానితో సెలక్షన్ కమిటీ వీరిద్దరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఉమా దేవి తెలిపారు. త్వరలో నాగ బాలాజీ, పండు బాబు కష్ణా జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె తెలిపారు. ప్రతిభ కనబరిచిన నాగ బాలాజీ, పండుబాబులను వీరికి ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన పాఠశాల వ్యాయామ విద్య సహాయకులు షేక్ మీరా సాహెబ్, ధనియాల నాగరాజులను అభినందించారు. ఇద్దరు విద్యార్థులు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో నివసిస్తూ చదువుకుంటున్నారు. ప్రోత్సహించిన కారి వసతి గృహ అధికారి ప్రకాష్ను ఉమాదేవి అభినందించారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం జడ్పీ బాయ్స్ క్రీడా మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా గన్నవరం జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఆటలు అలవాటు చేసుకోవాలని, ఇది ప్రతి మనిషి ఆరోగ్యానికి చాలా ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధీర్, గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, గన్నవరం జడ్పీ బాయ్స్ పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, పిఇటి నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వచ్చే నెల 8 నుండి 10 వరకు నంద్యాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలలో పాల్గొనే కష్ణా పురుషుల జట్టులో యస్.సాయికృష్ణ, బి.శివ నాగరాజు, కే భాగ్య రాజు, డి.నరేష్, కిరణ్, జి.వంశీ దుర్గ ప్రసాద్, ప్రభు, కే

శ్రీను, బి.జగదీష్, జి.రామాంజనేయులు, పి.కార్తిక్, కే జశ్వంత్, యం.సాగర్రెడ్డి ఎంపికయ్యారు. మహిళల జట్టులో కే.మౌనిక, బి.సాయి లత, పి.భవాని, పి. సాహితి, కె.సరస్వతి, కె.ఉమా మహేశ్వరీ, కే.మాధవి, ఆర్.రక్షిత, కనకదుర్గ, పి.మౌనికాంజలి, సవాంగ్, జి.స్రవంతి, వినుష్ స్థానం సాధించారు. ఎంపిక కమిటీ కన్వీనర్ బి.ప్రేమ్సాయి, సభ్యులుగా ప్రసాద్, నారాయణ, రాజేంద్ర వ్యవహరించారు.

ఎంపిడిఓ విటల్పాల్కు సత్కారం

ప్రజాశక్తి-పమిడిముక్కల: మండల అధికారిగా విటల్పాల్ ప్రజలకు అందించిన సేవలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా కొనియాడారు. బుధవారం కపిలేశ్వరపురం కళ్యాణ మండపంలో జరిగిన విటల్పాల్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జక్కా శ్రీనివాసరావు, కందిమల్ల సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచ్ ముల్లపూడి సునీత, విఓ విఆర్డి వెంకటేశ్వరావు, కార్యదర్శిలు ప్రసాద్, రమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గంగాధరరావుకు సన్మానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: పాగోలు గంగాధరరావు రెవెన్యూ శాఖలో అందించిన సేవలు అభినందనీయమని మండల తాసిల్దార్ లోక రాజు అన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో గత 23 సంవత్సరాలుగా ఆఫీస్ సబాఆర్డినేటర్గా గంగాధరరావు విధులు నిర్వహించారు. ఆయన పదవీ విరమణ అభినందన సభను పాలసీతలీకరణ సమావేశపు మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ లోకరాజు మాట్లాడుతూ గంగాధర్ రావు వీఆర్ఏ గా 13 సంవత్సరాలు పెదపారుపూడి మండలంలో తన విధులను నిర్వహించి ఉద్యోగోన్నతిపై గుడ్లవల్లేరు మండలం ఆఫీస్ ఆఫీస్ సబార్డినేటర్గా తన విధి నిర్వహణ అత్యంత బాధ్యతతో నిర్వహించారని, ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి రత్నకుమారి, డిటి కనకదుర్గ ఆర్ఐ పి.శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ చిరంజీవి, వీఆర్వోలు ప్రకాష్, వెంకన్న, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, భాస్కర్ రావు తదితరులు ఘనంగా సన్మానించారు.

రోడ్లపై గోతులు... తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి ప్రధాన సెంటర్, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల వద్ద మరియు పార్క్ ఎదురుగా నడకుదురు రోడ్డులో ఆర్ అండ్ బి ప్రధాన రోడ్లప్రమాదాలకు నిలయాలుగా మారాయి . విజయవాడ అవనిగడ్డ ప్రధాన రహదారి స్థానిక విద్యా కాన్వెంట్ సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా రహదారులపై ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల వల్ల పలువురు సైక్లిస్టులు ,ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు సహాయకులు ఈ రహదారులపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వ మండల ప్రధాన కార్యాలయాలకు వచ్చే ప్రజలు,చల్లపల్లి గ్రామం లో ప్రధాన పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తో పాటు నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారులపై గోతులు పడడంతో అటువైపు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం ఈ రహదారుల వెంట ప్రయాణించే అధికారులకు ప్రజాప్రతితులకు ఈ కోతులు కనబడటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రహదారుల పై పడిన గోతులు, గోతుల వల్ల జరుగుతున్న ప్రమాదాలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వెళ్లలేదా, ఒకవేళ తెలిసినా పట్టించుకోవడం లేదా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో చల్లపల్లి సర్పంచి పైడిపాముల

కష్ణకుమారి చొరవతో ఒకసారి, మరియు చల్లపల్లి కి చెందిన ప్రముఖులు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి రామ్మోహన్ రావు సహకారంతో ఒకసారి తాత్కాలికంగా ఈ రహదారులకు మరమ్మతులు చేసినప్పటికీ మళ్లీ యదాస్థితికి వచ్చాయి. ప్రజా ప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులు ఈ రోడ్లకు మరమ్మతులు లేదా శాశ్వత ప్రాతిపదికన బాగు చేయాలని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు.

విద్యుత్ భారాల ఉపసంహరణకు ఐక్య ఉద్యమాలు

★ టాక్స్ పేయర్స్ అసోసియేషన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం రౌండ్‌టేబుల్ పిలుపు

★ విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, సర్దుబాటు విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని తీర్మానం

★ మంత్రికి, సిఎండికి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయం

★ రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు ఐక్యవేదిక కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - విజయవాడ : ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై మోపుతున్న వేల కోట్ల విద్యుత్ భారాలను ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టగలమని వివిధ ప్రజా సంఘాల నేతలు అన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా రాజకీయాలకతీతంగా పార్టీలు, ప్రజాసంఘాలు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. "2024 నవంబరు 1 నుండి వసూలు చేయతలపెట్టిన రూ.6,072.86 కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించాలి" అని కోరుతూ విజయవాడ రాఘవయ్యపార్క్ సమీపంలోని బాలోత్సవ్ భవన్లో బుధవారం టాక్స్‌పేయర్స్ అసోసియేషన్, పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షులు వి.సాంబిరెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, సర్దుబాటు విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సమావేశం తీర్మానించింది. విద్యుత్ శాఖ మంత్రికి, ఆ శాఖ సిఎండికి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు ఐక్యవేదిక కమిటీ ఏర్పాటైంది. కమిటీ కన్వీనర్‌గా టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎంపికచేసింది. ఈ రౌంట్‌టేబుల్‌లో వివిధ సంఘాల నేతలు మాట్లాడిన అంశాలు వారి మాటల్లోనే...

మాట్లాడుతున్న జిఆర్‌కె పోలవరపు ట్రస్ట్ నిర్వాహకులు గోళ్ల నారాయణరావు

సర్దుబాటు పేరుతో ప్రజలపై భారాలు తగదు
ఎం.వి.ఆంజనేయులు, కార్యదర్శి, టాక్స్‌పేయర్స్ అసోసియేషన్

2014-2019కు సంబంధించి రూ.3016 కోట్ల ట్రూ అప్ ఛార్జీల పేరుతో యూనిట్‌కు 0.22 పైసల చొప్పున గత 27 నెలల నుండి వసూలు చేస్తున్నారు. ఇంకా 9 నెలలు అంటే 2025 జూలై వరకు వీటిని వసూలు చేస్తారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో 2021-2022కు సంబంధించి యూనిట్‌కు 0.66 పైసల చొప్పున 2022-2023 ఆర్థిక సంవత్సరం నుండి, ప్రతినెలా అంతకుముందు నెలలో వాడిన విద్యుత్‌కు యూనిట్‌కు 0.40 పైసల చొప్పున వసూలు చేస్తున్నారు. తాజాగా రూ.6,072 కోట్లను 15 నెలలపాటు వసూలు చేసేందుకు నిర్ణయించారు. దీంతో యూనిట్‌కు సగటున రూ.1.32 మేర భారం పడే అవకాశముంది.

ప్రైవేటు కంపెనీల వద్ద విద్యుత్ కొనుగోలు సరికాదు
ఎ.పున్నారావు, విద్యుత్ రంగ నిపుణులు

వివిధ రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న విద్యుత్ ఛార్జీలు హేతుబద్ధంగా లేవు. విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ప్రభుత్వానికి ఉన్నా.. ఆ దిశగా ఆలోచించడంలేదు. అధిక ధరలకు వివిధ ప్రయివేటు కం పెనీల వద్ద కొనుగోలు చేయడం సరికాదు. ఆ భారాలను వినియోగ దారు లపై మోపడం దారుణం. ఈ భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలి.

అవినీతి అక్రమాలే భారాలకు కారణం
గోళ్ల నారాయణరావు, జిఆర్‌కె పోలవరపు ట్రస్ట్ నిర్వాహకులు

ప్రభుత్వాలు ప్రజలపై అడ్డగోలుగా విద్యుత్ భారాలను మోపడమే పనిగా పెట్టుకున్నాయి. ఈ భారాలకు వ్యతిరేకంగా విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక ద్వారా కోర్టులో ఒక రిట్ పిటిషన్ వేస్తే బాగుంటుంది. ఆయా కాలాల్లో అధికారంలో ఉంటున్న ప్రభుత్వాలు అవినీతి అక్రమాలకు పాల్పడటం ద్వారానే విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయి.

వేల కోట్ల విద్యుత్ భారాలు పడే ప్రమాదం
సిహెచ్.బాబూరావు, కన్వీనర్, ఎపి పట్టణ పౌర సంక్షేమ సంఘాల సమాఖ్య

సర్దుబాటు విధానాన్ని అమలు చేస్తే వేల కోట్ల మేర విద్యుత్ భారాలు ప్రజలపై పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం విధించిన రూ.6072.86 కోట్లే కాకుండా మరో రూ.11,826 కోట్ల వసూలుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. ఇదే విషయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి ప్రకటించటం దారుణం. సర్దుబాటు ఛార్జీల భారం గృహ వినియోగదారులపైనే కాకుండా వివిధ రకాల చేతివృత్తులపై, వర్తక, వాణిజ్య సంస్థలు, చిన్న పరిశ్రమలపై అధికంగా పడుతుంది. ప్రీపెయిడ్ స్మార్టమీటర్లను ఇళ్లకు బిగించాలని ప్రధాని మోడీ చెప్పగా, ఆనాడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగీకరించి అమలు చేసింది. నేడు అవే విధానాలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటోంది. ఈ విధానాలు అమలైతే ఇళ్లకు బిగించే ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.13 వేలను ప్రజలే భరించాల్సి వస్తుంది. చౌక ధరలకు మద్యం కాకుండా తక్కువ ధరలకు విద్యుత్ ఇస్తే రాష్ట్రంలోని ఆరు కోట్ల మంది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

చిన్న పరిశ్రమలకు కోలుకోలేని దెబ్బ
వాసిరెడ్డి మురళీకృష్ణ, అధ్యక్షులు, స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్

రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ భారాలతో చిన్న పరిశ్రమ లకు కోలుకోలేని దెబ్బ తగులు తోంది. ఈభా రాలను ప్రభుత్వం తక్షణ మే ఉపసం హరించు కోవాలి. విద్యుత్ ఛార్జీల విధింపులో పారదర్శక విధానం అవసరం. మోయలేని విద్యుత్ భారాలను భరిస్తూనే మేము ఉత్పత్తి చేస్తున్న వస్తువల ధరలు నిర్ణయించు కోలేకపోతున్నాం. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా "విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక" ఇచ్చే పిలుపులకు మా అసోసియేషన్ సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుంది.

విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక పిలుపులకు సంపూర్ణ మద్దతు : వివిధ సంఘాల నేతలు

వి.శ్రీనివాస్

వి.సాంబిరెడ్డి

ఎంఎ.బాబు

ఇంకా ఈ సమావేశంలో వి.శ్రీనివాస్, మల్లేశ్వరరావు (ప్రింటర్స్ అసోసియేషన్), దామోదర రావు (ఛాంబర్ ఆఫ్ కామర్స్), వెంకటస్వామి (రైస్ మిల్లర్స్), శ్రీనివాస్ (ఎపిడిపిఎ), ఎం.వి.బాబు (సీనియర్ సిటిజన్ అసోసియేషన్), పి.ఆర్.కె.రెడ్డి (వాకర్స్ అసోసియేషన్), కొల్లి మురళీ కృష్ణ (లారీ ఓనర్స్ అసోసియేషన్), ఎస్.నాగభూషణం (రోటరీ క్లబ్) పి.మురహరి (పౌర సంక్షేమ సంఘం), వై.సుబ్బారావు (మోటారు మర్చంట్స్ అసోసియేషన్), వై.రమేష్ (ఫుట్వేర్ ఇండస్ట్రీ), చంద్రశేఖర్, ఎం.ఎన్.పాత్రుడు (పెన్షనర్ అసోసియేషన్), వేదాంతం శ్రీనివాస్, వి.ఎస్.రామరాజు (టాక్స్ పేయర్స్ అసోసియేషన్), సామాజిక కార్యకర్తలు మోతుకూరు అరుణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక ఇచ్చే పిలుపులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వ్యాపారాలు, పనులు తగ్గిపోయిన నేపథ్యంలో విద్యుత్ ఛార్జీలు భారంగా మారే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని వల్ల సరుకులు, సేవల ధరలు కూడా విపరీతంగా పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు. వీటికితోడు ఫిక్స్‌డ్ ఛార్జీల పేరుతో కిలోవాట్‌కు నెలకు రూ.10, కస్టమర్ ఛార్జీల పేరుతో రూ.25 నుండి రూ.55 వరకు, విద్యుత్ సుంకం పేరుతో యూనిట్‌కు 0.6 పైసలు (షాపులకు, పరిశ్రమలకు అయితే యూనిట్‌కు ఒక రూపాయి) చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. వీటన్నింటితో ఇప్పటికే విద్యుత్ వినియోగదారులపై విపరీతమైన భారం పడిందన్నారు. అందువల్ల తాజాగా విధిస్తున్న సర్దుబాటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, విద్యుత్ వినియోగదారుల నుండి వసూలు చేయొద్దని డిమాండ్ చేశారు.

చైల్డ్ సెంటర్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - భవానీపురం : భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ప్రత్యేక అవసర తలు ఉన్న విద్యార్థులు టపాసులు పేలుస్తూ స్వీట్స్ తినిపించు కొని తమ సంతోషాన్ని ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రిన్సిపాల్ జె.సునీత మాట్లాడుతూ తమ భవిత్ స్పెషల్ నీడ్ స్పెషల్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌లో ప్రతి పండుగను వేడుకను మతాలకతీతంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహంతో పాటు సమానత్వాన్ని చాటి చెప్పేలా ప్రతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సెంటర్‌లో ప్రత్యేక అవసరతలు ఉన్న విద్యార్థులకు అవసరమైన స్పీచ్ థెరపీ, ఫిజియోథెరవీ, ఆక్యుపేషన్ థెరపీ వంటి సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. సెంటర్ సేవలు వినియోగించుకునేందుకు 9985951397 నెంబర్‌ను సంప్రదించాలని సునీత కోరారు. దీపావళి వేడుకల్లో ప్రత్యేక అవసరతలు ఉన్న విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో రెడ్‌క్రాస్ అగ్రగామి : సిఇఒ ఫరీడా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సమాజంలో అత్యవసర సమయాల్లో సేవలందించే సంస్థల్లో రెడ్‌క్రాస్ అగ్రగామి సంస్థగా కొనసాగుతుందని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఈవో ఏకే ఫరిడా అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల, రెడక్రాస్ సోసైటీ సంయుక్త ఆధ్వర్యంలో క్లైమెట్ ఎక్షాన్ అవగాహనా కార్యక్రమం ఆ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏకే ఫరిడా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఒక అంతర్జాతీయ మానవతా ఉద్యమమన్నారు. 1859 జూన్ 24న జీన్ హెన్రీ డ్యూనంట్ రెడ్‌క్రాస్‌ను స్థాపించారన్నారు. తొలి రోజుల్లో కేవలం యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవలందించేందుకు ఈ సంస్థ పాటుపడిందన్నారు. విద్యార్థులను చైతన్యవంతం చేసి తద్వారా ప్రపంచాన్ని అవగాహన పరిచే దిశగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తొలుత రెడ్‌క్రాస్ సోసైటీ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సోసైటీ స్టేట్ కో-ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ. నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కష్ణవేణి తదితరులు ప్రసంగించారు. పీవోలు ఎన్. సాంబశివరావు, కల్మాబేగం, శ్రీనివాస్ తదితరులు నిర్వహించారు.

సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఒసి అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్ సితార సెంటర్ రామరాజ్య నగర్‌కి చెందిన చుక్కా నాగరాజు తన బైపాస్ సర్జరీ కోసం తక్షణ ఆర్థిక సాయంకై సీఎంఆర్ఎఫ్ కింద లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఒసి)కి ఎంపి కేశినేని శివనాథ్ సాయంతో ఆర్జీ పెట్టుకున్నారు. మంజూరైన రూ.2 లక్షల యాభై వేల రూపాయల ఎల్‌ఒసిని బుధవారం చుక్కా నాగరాజు కుమారుడు చుక్కా రాజ్ కుమార్‌కి ఎంపి కార్యాలయ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో వో.ఎస్.డి వెంకటరత్నం, లైజనింగ్ ఆఫీసర్ వి.మోహనరావు, బాలినేని మోహనరావు పాల్గొన్నారు.

43వ డివిజన్లో టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 43వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు పిలుపు మేరకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అదేశాల మేరకు 43వ డివిజన్ అధ్యక్షులు కొనికి కొండయ్య ఆధ్వర్యం లో టిడిపి సభ్యత్వ నమోదు బుధ వారం చేపట్టారు. ఈ కార్య క్రమంలో తెలుగు దేశం రాష్ట్ర అధికార ప్రతినిధి కె నాగుల్ మీరా, పశ్చిమ నియోజక వర్గం టిఎన్‌టియుసి గౌరవ అధ్యక్షులు కాంద్రేగుల రవీంద్ర, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాదు (అన్న) చేతుల మీదుగా మొదటి సభ్యత్వాన్ని 43వ డివిజన్ అధ్యక్షులు కొనికి కొండయ్య రెన్యూవన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు డబ్బుకొట్టు ఏడుకొండలు, డివిజన్ ప్రధాన కార్యదర్శి వల్లభనేని ప్రసన్న లక్ష్మీ, తెలుగు యువత అధికార ప్రతినిధి పూజల శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ కో-ఆర్డినేటర్ రాళ్లపూడి మాధవ్, రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యనిర్వాహక కార్యదర్శి పాల మాధవ్, రాష్ట్ర కార్యదర్శి గాలీషా, మైలవరపు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నాగుల్ మీరా చేతుల మీదుగా సభ్యత్వం అందుకుంటున్న టిడిపి నాయకులు

దిగిరానంటున్న ఉల్లి ధర

ప్రజాశక్తి-గన్నవరం: ఉల్లిపాయల ధర దిగిరానంటోంది. పాతవి పెద్ద సైజు కిలో రూ.65 నుంచి రూ.70 వరకు ఉంది. కొత్తవి మధ్య సైజు కిలో రూ.60.చిన్నవి కిలో రూ.50 ధర పలుకుతోంది. చిల్లర దుకాణాల్లో మరోపది రూపాయలు అదనంగా ధర ఉండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కోయకుం డానే కన్నీరు వస్తుందని మహిళలు అంటున్నారు. వంటకాల్లో ఉల్లిపాయలు వేయడానికి ఆలో చిస్తున్నారు. ఉల్లి వేయకుంటే రుచి ఉండదని తెలిసినా కొనలేనమిఅవి లేకుండానే కూరలు చేసుకుంటున్నామని మహిళలు చెప్పారు. ఇంత ధరలు గత పదేళ్లలో ఎప్పుడూ చూడలేదని తెలపారు. గన్నవరం మార్కెట్లో హెూల్సెల్ దుకాణం ఒకటి ఉంది. చిల్లర దుకాణాలు 26 ఉన్నాయి. 26 గ్రామాల నుంచి చిల్లర దుకాణాలు వ్యాపారులు గన్నవరం వచ్చి ఉల్లి తీసుకె స్తారు. రేట్లు బాగా పెరగడంతో వాటిని తీసుకెళ్లడానికి ఆలోచిస్తున్నారు. రోజుకు 50 కిలోలు ఉల్లిపాయలు తీసుకెళ్లే చిల్లర వ్యాపారులు పట్టుమని ఐదు కేజీలు తీసుకెళ్లడం లేదని చెప్పారు. కిలో రూ.60 ధర చెబితే జనాలు కొనడానికి ముందుకు రావడం లేదంటున్నారు. గన్నవ రం మండలంలో 28 గ్రామాల్లో రోజుకు వంద బస్తాల ఉల్లిపాయలు అమ్ముడు పోయేవి. రే ట్లు పెరిగిన తర్వాత రోజుకు 20 బస్తాలు వెళ్లడం లేదు. సామాన్యులు ఎవ్వరూ వాటిని కొనుగోలు చేయడం లేదు. ఆర్థికంగా ఉన్న వారు నెలకు ఆరు కిలోలు వాడితే ఈరేట్లలో రెండుకిలోలు తీసుకెళ్లడం లేదని వ్యాపారి శ్రీనివాసరావు తెలిపారు. హెూల్సెల్ దుకాణంలోనూ ఉల్లి వ్యాపారం తగ్గిందంటున్నారు. మహా రాష్ట్ర, కర్నూల్, కర్నా టక, పూన నుంచి ఉల్లిపాయలు రావాలి. కర్నూల్, పూన నుంచి ఉల్లిపాయలు వస్తున్నా కొత్తవి కావడంతో కుళ్లి పోతున్నాయి. నాశిరకమని వ్యాపారులు చెబుతున్నారు. అయినా తప్పని పరిస్థితుల్లో వాటిని దిగుమతి చేసుకుంటే సగానికి కుళ్లిపోయి ఆర్థికంగా నష్టం వస్తుందని తెలిపారు. మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు వస్తేనే మార్కెట్లో రేట్లు తగ్గుతాయని వ్యాపారులు చెప్పారు. గత 15 రోజులుగా ఉల్లిరేట్లు విపరీతంగా పెరిగాయి. సరుకు లేకుండా ధరలు ఏవిధంగా తగ్గుతాయని అంటున్నారు. పెద్ద వ్యాపారులు ఉల్లిని బ్లాక్ చేసి ధరలు పెంచారనే విమర్శ ఉంది. ప్ర భుత్వం ఉల్లిని దిగుమతి చేసుకుని రైతుబజార్ల ద్వారా జనాలకు తక్కువ ధరలకు ఇప్పించాల ని కోరుతున్నారు.

కిలో వందకు కొనగలమా? : చినబాబు

కిలో ఉల్లిపాయలు వంద రేటు తానెప్పుడూ చూడలేదు. వినలేదూ. సామాన్యులు ఫీవర్ ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వమే ఉల్లి సరఫరా చేయాలి : శ్రీను

ప్రభుత్వం ఉల్లి సరఫరాకు చర్యలు తీసుకోవాలి. రైతు బజార్ల ద్వారా కిలో రూ.30కి వచ్చేలా చూడాలి. ఆ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. రైతు బజార్లో వారం

రోజులు కిలో రూ.40కి అమ్మివ దిలేశారు. మార్కెట్లో పాతవి రూ.70, కొత్తవి చిన్నవి రూ.50 అమ్ముతుంటే వినియోగదారులు పరేషాన్కు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ను నియం త్రించి ఉల్లిని అందుబాటులోకి తీసుకురావాలి.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం గుడివాడలో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మానవులందరికీ భగవద్గీత అనే అంశం గల పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గుడివాడ విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్ మాట్లాడుతూ పుస్తక ముఖ్య ఉద్దేశం శ్రీకష్ణుని ద్వారా ఉద్భవించిన 701 శ్లోకాలు భగవద్గీత, వీటి ప్రాధాన్యత నేటి విద్యార్థులకు తెలియజేయాలని సదుద్దేశంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ పుస్తకాలను ముద్రించిందన్నారు. అందులో భాగంగా గుడివాడకు సుమారు మూడు వేల పుస్తకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన ఉపాధ్యక్షులు శేగు వెంకటరామారావు, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం విజయసారధి ఆచార్యులు, భవాని, అంజమ్మ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అంగన్వాడీలకు అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గన్నవరంలో మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు మాదకద్రవ్యాల నివారణ, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్కుషాప్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ సామజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు, మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. నిత్యజీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారన్నారు. అవగాహనతో మాదకద్రవ్యాలను కట్టడి చేయవచ్చన్నారు. సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారన్నారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.విజయరాణి మాట్లాడుతూ ఒంటరితనం, డిప్రెషన్‌కు సోషల్ మీడియా కారణమవుతుందన్నారు. తద్వారా అనేక మందిలో నిద్ర

లేమికి కారణమవుతుందన్నారు. మత్తుకు బానిసైన వారిని డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, ఇందుకోసం 9490492020 నెంబర్‌కు సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల అభివృద్ధి పథక అధికారి పి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మదేవి, నాగ పద్మావతి, ధనలక్ష్మి, దుర్గాదేవి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ : పెండింగ్లో ఉన్న విద్యాదీవెన వసతి, దీవెన తక్షణమే విడుదల చేయాలని, డిగ్రీలో స్పెషల్ ఫీజులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం డిమాండ్ చేశారు. బుధవారం గుడివాడలో ఉన్న కేటీఆర్, ఏఎన్నార్, రిషి ఒకేషనల్, బిఎస్ఎన్, గుడివాడ ఒకేషనల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు విద్యార్థినిలు ఆధ్వర్యంలో గుడివాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అలాగే ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు గత ప్రభుత్వం పెండింగ్లో ఉన్న విద్యా దీవెన వసతి దీవెనలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అదేవిధంగా జిల్లాలో అనేక మంది విద్యార్థులు అర్హులైన వారికి నాలుగు విడతల్లో గత ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తానని హామీ ఇచ్చి ఒక విడత 35 కోట్ల రూపాయలను విడుదల చేసి 105 కోట్లు బకాయిలు ఉంచినట్లు తెలియజేశారన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాదీవన వసతి దీవెనలను రీఎంబర్స్‌మెంట్‌గా కన్వర్ట్ చేసి విద్యార్థులు ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పి ఇప్పుడు ఆ వాగ్దానాన్ని మర్చిపోయి తిరుపతి లడ్డు, ఇసుక, మద్యంపై దష్టి సారించిందన్నారు. విద్యారంగం పైన గాని విద్యార్థుల అభివద్ధిపైన గానీ ఏమాత్రమైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పెండింగ్లో ఉన్న విద్యా దీవెన వసతి దీవెనలను విడుదల చేయాలని, విద్యార్థులకు భారం అవుతున్న స్పెషల్ ఫీజులను తక్షణమే రద్దు చేయాలని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పడిన తర్వాత విద్యార్థులు ఫీజులు కడతారని అప్పటివరకు కళాశాల యాజమాన్యాలు ఎటువంటి ఒత్తిడి చేయకూడదని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరగకపోతే జిల్లాలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను కేంద్రీకరించి రిలే నిరాహార దీక్షలకు భవిష్యత్తులో పిలుపునిస్తామని హెచ్చరించారు. తదుపరి జిల్లా కేంద్రంలో దీక్షలు నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచారు కానీ ఇప్పటివరకు జీవో నెంబర్ 77ను రద్దు చేయకపోగా నూతనంగా జాయిన్ అయిన పీజీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ కలిపిస్తామని స్పష్టమైన హామీని కూడా ప్రకటించకపోవడం ఎంతవరకు సబబని ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రివర్యులు, నారా లోకేష్‌ని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సలీమ్, గుడివాడ అధ్యక్షులు నరేంద్ర, నాయకులు సాయిరామ్, పవన్, కిషోర్, విద్యార్థులు భారతి, హారిక, పావని, దుర్గ, ఐద్వా నాయకురాలు రజినీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు గ్యాస్ ఉచితంగా ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ : సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభం చేశారు కానీ డబ్బులు ముందుగా చెల్లించి 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయని చెప్పడం చాలా దారుణం అని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. గుడివాడ సుందరయ్య భవనంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నది అలాగే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న డబ్బులు ఏజెన్సీ వాళ్ళకి అందచేయాలని పేద ప్రజలకు మాత్రం ఉచితంగానే ఇవ్వాలని కోరారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 400 రూపాయలున్న గ్యాస్ సిలిండర్‌ని సబ్సిడీ మేము వేస్తున్నామని చెప్పి మోసం చేసి ప్రజలకి పూర్తిగా సబ్సిడీని ఎత్తేసిందన్నారు. అదేవిధంగా కూటమి ద్వారా గెలిచిన ప్రభుత్వం భవిష్యత్తులో కొనసాగిస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు కాబట్టి గ్యాస్ ఏజెన్సీ ద్వారా లింకు చేయించుకున్న వారికి ఉచితంగా మూడు గ్యాస్ బండలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని పాల్గొన్నారు.

కమిటీ సభ్యునిగా అర్జున్

ప్రజాశక్తి-గుడివాడ : విజయవాడ డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్స్ (సలహాదారులు)గా బిజెపి పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్, వాసుపల్లి రాంప్రసాద్, మామిడాల వెంకటరమణకుమార్‌లను భారత రైల్వే శాఖ నియమించి నియామకం పత్రాలను అందజేశారు. బుధవారం గుడివాడ రైల్వే స్టేషన్‌లోని రైల్వే మేనేజర్ దేవరకొండ రమేష్ ఈ మేరకు రైల్వే

గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవి ఆధ్వర్యంలో భారత రైల్వే శాఖను నూతన పద్ధతిలో అభివద్ధిని సాధిస్తూ ముందడుగు వేస్తుందన్నారు. గుడివాడ రైల్వే స్టేషన్ అభివద్ధికి మంజూరు అయిన నిధులు సక్రమంగా వినియోగించడటానికి తమ వంతు సలహాలు రైల్వే అధికారులకు తెలియజేస్తామన్నారు.

విద్యార్థులు నైపుణ్యం ఉన్న రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: నైపుణ్యం ఉన్న రంగాన్ని ఎంచుకొని విద్యార్థులు విజయం సాధించాలని రిసోర్స్ పర్సన్ డాక్టర్ వి రామకష్ణ అన్నారు. స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం ఫార్మసిటికల్ రీసెర్చ్ ఇన్ క్లినికల్ ట్రయల్స్ ఇన్ ఇండియా గ్రోత్ ప్రాజెక్ట్ మరియు కెరీర్ ఆపర్చునిటీస్ పది అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ బి రామకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సన్ ఫార్మసిటికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, గురగాన్, హర్యానా వ్యవహరించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ రామకృష్ణ సదస్సు ముఖ్యాంశంపై ఓరల్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. ఔషధ పరిశోధనలలో గల వివిధ దశలను వివరించారు. నూతన ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసే ముందు జంతువులపై, మానవులపై పరీక్షించి వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను అంచనా వేస్తారని తెలిపారు. ఇప్పుడున్న విజ్ఞానాన్ని వినియోగించుకొని కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఔషధాన్ని పరీక్షించే ప్రయత్నం చేస్తున్నారని తద్వారా జంతువులు, మానవులు లేకుండా పరీక్షలు చేసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే విద్యార్థులంతా తమకు నైపుణ్యం ఉన్న రంగాన్ని ఎంచుకొని విజయం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ టి కుందన, మరియు అధ్యాపకులు డాక్టర్ ఎస్ కె అమీనాబీ, డాక్టర్ పి రవీష, డాక్టర్ టి ప్రశాంతి, డాక్టర్ టీ బాలకష్ణ, బి సత్య శ్రీ పాల్గొని ముఖ్య అతిథిని మెమొంటోతో బహుకరించి సత్కరించారు.

400 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కవుతరం జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో

42 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వై పి సి ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో కాలుష్యాన్ని నివారించాలి సిపిఎం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డు సిపిఎం శాఖ మహాసభ చంపసాల ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు జగ్గయ్యపేట మండల, పట్టణ కార్యదర్శి ఎస్ నాగమణి, సిపిఎం సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు, కోట కృష్ణ, షేక్ గౌస్ పాల్గొన్నారు. మహాసభలో ముందు సిపిఎం జెండాను రంగిశెట్టి కోటేశ్వరి ఆవిష్కరించారు. అనంతరం మహాసభ నాలుగు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వాటిలో ఆటోనగర్‌లో గల ఫ్యాక్టరీల్లో వచ్చే కాలుష్య సమస్యను పరిష్కరించాలని, ఆటోనగర్లో గల రెండు వీధులకు షేర్ మహమ్మద్ పేట గ్రామం నుండి మరో రెండు వీధులకు ఆటోనగర్‌లో గల ఫ్యాక్టరీ నుండి కరెంట్ సరఫరా అవుతుందని, ఆటోనగర్ ఫ్యాక్టరీ నుండి వచ్చే కరెంటు వల్ల ఇబ్బందికి గురవుతున్నామని తెలిపారు. ఆటోనగర్‌లో గల కరెంటు కాకుండా షేర్ మహమ్మద్ పేట గ్రామం నుండి విద్యుత్ సరఫరా చేయాలని, గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని మహాసభ తీర్మానించారు. అనంతరం శాఖ కార్యదర్శిగా రంగిశెట్టి కోటేశ్వరిని ఎన్నుకున్నారు.

గ్రామ చిత్రపటం ప్రదర్శన

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని భీమవరం గ్రామంలో గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామ చిత్ర పటాన్ని కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు, రైతు సేవా కేంద్రం వారు భీమవరం సిబ్బందితో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు, పంట సరళి, రైతుల సమస్యలపై ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ చిత్ర పటాన్ని రైతులకు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వివరించారు.

జాబ్ మేళాలో ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి - మైలవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపి ఎస్ఎస్‌డిసి) జిల్లా ఉపాధి కల్పన శాఖ డిఆర్‌డిఏ సీడా ఫ్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు బుధవారం స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 14 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు (ఎఫ్ఎసి) జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్వ్యూలకు 14 మంది హాజరు కాగా వారిలో ఆరుగురు ఎంపికయ్యారన్నారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, కెవిఎల్ గ్రూప్స్, జస్ట్ డయల్ కంపెనీ వారు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇల్ల రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా విజ్ఞాన కేంద్రం పనులు

ప్రజాశక్తి వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో బొగ్గవరపు వెంకటేశ్వరావు విజ్ఞాన కేంద్రం భవనానికి బుధవారం స్లాబ్ వేశారు. ఈ భవనం గత ఆరు నెలల క్రితం నుండి శంకుస్థాపన చేసి నిర్మాణం చేపట్టారు. దీంతో అప్పటినుండి భవనం నిర్మాణం జరుగుతూ వచ్చింది. బగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ సభ్యులు చిరుమామిళ్ల హనుమంతరావు, తమ్మినేని రమేష్, మండెపూడి చంద్రశేఖర్, కంచర్ల కొండయ్య, రాము, ఎస్.కె.నాగులు మీరా, కొంగర వెంకటేశ్వర్లు, గంగుల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాంకేతిక సమ్మేళన ఉత్సవం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళన ఉత్సవం బుధవారం ముగిసింది. ఈ ఉత్సవం మొదటిరోజు మంగళవారం విద్యార్థులలో సాంకేతిక ప్రతిభను వెలికి తీసే సాంకేతిక విషయ పరిజ్ఞానానికి సంబంధించిన పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, షార్ట్ ఫిలింలలో పోటీలు జరిగాయి. రెండో రోజు బుధవారం సాంస్కృతిక, శారీరక దఢత్వ నైపుణ్య పోటీలైన స్లో సైకిల్, స్లో బైక్ రైడింగ్ డాన్స్ (సోలో అండ్ గ్రూప్) పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముళ్లపూడి బాపినీడు జనరల్ మేనేజర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టు మేనేజర్ కరీం హాజరయ్యారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : 33 బాధిత కుటుంబాలకు రూ. 18 లక్షల పైగా సిఎం సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం సిఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం నందిగామ పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం షాపు వద్దని ధర్నా

ప్రజాశక్తి - విస్సన్నపేట : మద్యం షాపులు నివాస ప్రాంతాల్లో పెట్టొద్దని సిపిఎం, మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. దీంతో స్పందించిన తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ప్రజలు అభ్యంతరం తెలిపిన చోట మద్యం షాపులు పెట్ట కూడదని నిర్వాహకులకు సూచించారు. విస్సన్నపేట ఎ.కొండూరు రోడ్డు సిద్ధార్థ కాలేజీకి వెళ్లే మార్గం మధ్యలో మద్యం షాపులు వద్దని సిపిఎం మహిళా సంఘాలు నివాస ప్రాంత ప్రజలు మద్యం షాపు నిర్మాణం వద్దని ఆందోళన చేశారు. వెంటనే స్పందించి అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు ఆపాలని చెప్పారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులు నివాస ప్రాంతాల్లో పెట్టవద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా షాపులు నిర్మాణం జరుగుతున్నాయని దీనిపై సిపిఎం మహిళా సంఘం ఇప్పటికే ఆందోళన చేశామని ఎక్కడైనా మద్యం షాపులు నివాస

ప్రాంతాల్లో పెడితే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం మహిళా సంఘం మండల అధ్యక్షులు రంగారాని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు పులిబళ్ళ ఏడుకొండలు ఎస్కే బాజీ, కుమార్ నాయక్ చిట్టిబాబు రిటైర్డ్ మాస్టర్ నాగేందర్ పర్వ ఉపసర్పంచ్ ప్రసాద్ నివాస ప్రాంత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎల్ఐసి ఏజెంట్లు డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని డివిజన్ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం ఎల్ఐసి ఏజెంట్ల సమావేశం బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎం.కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూఎల్ఐసి పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని, పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పాలసీలపై బోనస్ పెంచాలని కోరారు. ఎల్ఐసి ఏజెంట్లకు జరుగుతున్న అన్యాయంపై తమ పోరాటం గత నెల రోజుల నుండి చేస్తున్నామన్నారు. ఈనెల 15, 18, 22, 25, 30 తేదీలలో గేటు మీటింగ్‌ను నిర్వహించడంతో పాటు ఈ నెల 28వ తేదీ ఏజెంట్లు రెస్ట్ డే కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. తొందరలోనే ఎల్ఐసి మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరగనున్నా యన్నారు. త్వరలోనే సిఎం, ఎంపికి వినతి పత్రాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. బ్రాంచ్, డివిజన్, జోనల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలతో పాటు ఎల్ఐసి సెంట్రల్ ఆఫీస్ కార్యాలయం, ఐఆర్‌డిఎఐ కార్యాలయాల వద్ద శాంతియుతంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కే శ్రీనివాస కుమార్ డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె మారుతి, జోనల్ ఈసీ మెంబర్ పి.వెంగళరావు, డివిజన్ జాయింట్ సెక్రటరీ జి.మురళీకృష్ణ, ఎల్ఐసి బ్రాంచ్ సెక్రటరీ ఏ సైదులు, ట్రెజరర్ టీ నరేంద్ర కుమార్, ఏజెంట్లు పాల్గొన్నారు.

కాలుష్యం పై పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఉపముఖ్యమంత్రి పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు 10 వేల ఉత్తరాలు రాయాలని థర్మల్ విద్యుత్ కేంద్రం కాలుష్యంపై జనసేన, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమం ఉధృతం చేశారు. అందులో భాగంగా ఉపముఖ్యమంత్రి పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు 10 వేల పోస్ట్ కార్డు ఉత్తరాలు పంపనున్నారు. ఈ కార్యక్రమాన్ని జనసేన అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి అక్కల గాంధీ నిర్వహించారు.

కృష్ణా జలాల సరఫరాలో అలసత్వం వద్దు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలంలో కిడ్నీ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తాగునీటి కొరకు సరఫరా చేస్తున్న కృష్ణా జలాల సరఫరాలో అధికారులు అలసత్వం వహించవద్దని నిరంతరాయంగా కృష్ణా జలాలు సరఫరా అయ్యేలా చూడాలని తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కృష్ణా జలాల సరఫరాపై అలానే పైప్ లైన్ పనుల అంశంపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల సరఫరా నిరంతరాయంగా కొనసాగడం లేదని తనకు ఫిర్యాదులు అందుతున్నాయని ఇక మీదట నీటి సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని

నేటి సరఫరాల అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎ.ఇ.లక్ష్మీ మండల పరిషత్ సూపరింటెండెంట్ కమల విష్ణు ఎంఇఒ 2 కేశవరావు పాల్గొన్నారు.

మోటార్ల దొంగ అరెస్టు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట, తిరుమలగిరి, పోచంపల్లి, బలుసుపాడు గ్రామాల్లో 7 మోటర్లను, ఆ మోటార్లను దొంగలించిన దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నందిగామ ఎసిపి డాక్టర్ రవికిరణ్ తెలిపారు. పట్టణంలోని సిఐ కార్యాలయంలో బుధవారం నలుగురు ముద్దాయిలను, మోటార్లతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిబి రవి కిరణ్ మాట్లాడుతూ కొన్నిరోజులుగా చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధులలో జరుగుతున్న వరుస మోటార్ దొంగతనాలు పోలీసు ఉన్నతాధికారుల సూచన మేరకు గాలించినట్లు తెలిపారు. షేర్ మహమ్మద్ పేట, తిరుమలగిరి, బలుసుపాడు, పోచంపల్లి గ్రామాలలో బోరుబావి మోటర్లు మొత్తం 7 దొంగిలించి వాటి విలువ సుమారు 1.50లక్షలు ఉన్నట్లు వాటిని అమ్మటానికి వెళ్తుండగా షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డు వద్ద చిలకల ఎస్సై సూర్య శ్రీనివాస్, సిబ్బంది సహాయంతో వారిని, వారి వద్ద వున్న మోటర్లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బాణాసంచా షాపుల పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో ఏర్పాటు చేసిన బాణాసంచా షాపులను ఎమ్మార్వో సురేష్ బాబు, సీఐ వైవిఎల్ నాయుడు బుధవారం పరిశీలించారు. షాపు నిర్వహకులతో మాట్లాడుతూ షాపు నిర్వహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, షాపుల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు ప్రతి షాపు వద్ద ఫైర్ మిషన్, వాటరుతో డ్రామ్,ఇసుక తప్పని సరిగా ఉండాలని తెలిపారు. రెవెన్యూ, ఫైర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు స్పందన

ప్రజాశక్తి - గంపలగూడెం : రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా బుధవారం నెమలి గ్రామంలో జరిగిన గ్రామసభకు మంచి స్పందన లభించిందని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరభద్రరావు తెలిపారు. ఇందులో రైతులు వివిధ విభాగాలకు చెందిన 28 అర్జీలు సభలో అందజేసినట్లు వివరించారు. తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, ఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మ విశ్వాసం తో ఉండాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : విద్యార్థులకు ఆత్మ విశ్వాసం చాలా అవసరం అని విస్సన్నపేట లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక వికాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ రావు, లయన్స్ క్లబ్ విస్సన్నపేట అధ్యక్షుడు కిరణ్, డాక్టర్ శ్రీనివాస్,జగన్మోహన్ రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు

ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్స్, ఓనర్స్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మైలవరం : శ్రీ దుర్గా భవాని ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పత్తిపాటి రవికిరణ్, ఉపాధ్యక్షులుగా కంచన పాండురంగారావు, కార్యదర్శిగా మల్లారపు గోపి, కోశాధికారిగా గాళ్ళ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మల్లారపు సాంబయ్య, మరో ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

టపాసుల విక్రయ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : దీపావళి పండుగ సందర్భంగా వినియోగించే మందుగుండు సామగ్రి విక్రయ కేంద్రాలను మైలవరం ఏసిపి వై.ప్రసాదరావు పరిశీలించారు. బుధవారం నాడు ఆయన రెడ్డిగూడెం మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ బి.రామ్మోహనరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అనుమతులు లేకుండా షాపులు నడపరాదనీ, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి గ్రామానికి చెందిన గుత్తా వెంకటరమణ(బాబు)కు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.పది లక్షల చెక్కును రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు టి.డి.జనార్ధన్ అందజేశారు. వారు గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా బాధిత కుటుంబ సభ్యులు, గ్రామ టిడిపి నాయకులు టీడీ జనార్ధన్ దృష్టికి స్వయంగా తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి తీసుకొని వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.పది లక్షలు మంజూరు చేయించారు.

క్రాకర్స్ షాపులకు వర్షం దెబ్బ

ప్రజాశక్తి - మైలవరం : దీపావళిని పురస్కరించుకుని క్రాకర్స్ షాపుల వారికి వర్షం అడ్డంకిగా మారింది. దీంతో కొనే వాళ్ళు లేక షాపులు వెలవెలబోతున్నాయి. మైలవరంలోని ఎస్ఎస్‌కె ఎదురుగా ఉన్న కాళీ ప్రదేశంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 8 షాపులను ఏర్పాటు చేశారు. అయితే గురువారం దీపావళి పండుగ కావటంతో బుధవారం వ్యాపారాలు బాగా ఉంటాయని నిర్వాహకులు అనుకున్నారు. కానీ బుధవారం ఉదయం నుంచి ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడటంతో క్రాకర్స్ షాపులు వెలవెలబోయాయి. ఎంతో పెట్టుబడి పెట్టి తెచ్చామని వర్షం ఇలాగే ఉంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. పదేపదే వర్షపు జల్లులు రావడంతో క్రాకర్స్ నిముకొని, తడిసి ఉండటంతో సరిగా పేలవనే ఉద్దేశంతో కొనుగోలు చేయడానికి కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో అండర్ పాస్ వద్ద బుధవారం తెల్లవారుజామున బైక్ అదుపుతప్పి యువకుడు అక్కడికక్కడే మతి చెందాడు. కంచికచర్ల అరుంధతీ కాలనీకి చెందిన బల్ల హరీష్ (25) విజయవాడ వైపు నుండి కంచికచర్లకు బైక్‌పై వస్తున్నాడు. పరిటాల సమీపంలో సర్వీస్ రోడ్డులో అండర్ పాస్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ఈ సంఘటనలో హరీష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
గురువారం 31 అక్టోబర్ 2024

నిబంధనలకు విరుద్ధంగా టపాసుల దుకాణాలు

ప్రజాశక్తి-పెడన: ఈ ఏడాది దీపావళి పండుగను పురస్కరించుకుని అనుమతుల విషయంలో రాజీ పడొద్దు అంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆచరణలో మాత్రం కిందిస్థాయి అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణ సాక్షాత్తు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పెడన పట్టణంలో చోటు చేసుకోవడం ఉన్నతాధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. ఇందుకు ఉదాహరణ పట్టణ పరిధిలోని గుడివాడ రోడ్ లో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలే ఇందుకు నిదర్శనం. మంగళవారం ఆర్డీఓ కే స్వాతి బాణసంచా దుకాణాల నిర్వహించే స్థలాన్ని పర్యవేక్షించి అనుమతులు జారీ చేయొద్దన్నప్పటికి క్రింది స్థాయి అధికారులు మాత్రం యదేచ్ఛగా అనుమతులు ఇవ్వడం పై ఒక్కరోజులోనే దాదాపు 8 లక్షలకు పైగా మామూళ్లు చేతులు మారినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా వాహనాల పార్కింగ్ స్థలం లేనప్పటికీ బైపాస్ రోడ్ లోనే వాహనాలను నిలుపుదల చేయడంతో రెండు ప్రమాద సంఘటనలు బుధవారం చేసుకోవడంతో చూపురలు అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఒక్కోక్క షాపుకు 9 నుంచి 15 అడుగుల దూరం పాటించాల్సినప్పటికీ కేవలం 2 నుంచి 3 అడుగులు దూరం కూడా లేకపోవడంతో ఘటనా స్థలంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఏంటని కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే కత్తివెన్ను మండలంలో బుధవారం జరిగిన సంఘటన పునరావతం అవుతుందని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ షాపులపై అనధికార అనుమతులపై ఉన్నతాధికారులు పర్యవేక్షించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పట్టణ,రూరల్ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. లక్షల్లో చేతులు మారిన... ఉన్నతాధికారులు ఆదేశాలు ఎంతవరకు పాటిస్తారని వేచి చూడాల్సిందే. ఈ విషయంపై ఇంచార్జ్ తహసిల్దార్ అనిల్ కుమార్ ను వివరణ కోరగా ఇందుకు అనుమతులు రెవిన్యూ నుంచే కాకుండా మిగిలిన శాఖల నుంచి సేకరించమన్నారు. తాను వెళ్లి పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: నిబంధనలకు విరుద్ధంగా దీపావళి మందు గుండు సామాగ్రి అమ్మకాలను మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లో నిర్వహిస్తున్నట్లు సమాచారం. గత సంవత్సరం నిల్వ ఉన్న టపాసులను ఈ ఏడాది విక్రయించడమే కాకుండా అధిక ధరలతో విక్రయాలను కొనసాగించడంతో వినియోగదారులు జేబులకు చిల్లులు పడుతున్నాయి. కొంతమంది అధిక ధరలకు కొనుగోలు చేయలేక ఈ సంవత్సరానికి వద్దులే అని సరిపెట్టుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కి కొంతమంది అధికారులు చొరవతో ఈ విక్రయాలు కొనసాగుతున్నట్లు సమాచారం. అనుమతులు లేని షాపులు పెట్టి అడ్డగోలుగా రేట్లను ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు.

అసత్య ఆరోపణలపై ఫిర్యాదు : గౌతమ్

ప్రజాశక్తి-అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే అధ్వానంగా ఉన్న అవనిగడ్డ కోడూరు రహదారి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటివరకు ఆ రహదారిని వదిలివేయడంతో

ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని యువ న్యాయవాది బడే గౌతం అన్నారు. ఏ వన్ మార్ట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారి నిర్మాణం చేపట్టలేదని కూటమి నాయకులు అనేక రూపాలలో ఆందోళన చేశారని కానీ వారు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయిన ఆ రహదారిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా కాంట్రాక్టర్ కొంత పనులు చేసినప్పటికీ ఆ పనులు ఆపివేయడంతో ఆ రహదారి యధాస్థితికి చేరుకుందని తెలిపారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ యూట్యూబ్ ఛానల్స్‌లో ప్రచారం చేస్తున్నారని వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని స్టేట్ బ్యాంక్ సందులో ఉన్న ఎస్‌విఎల్ క్రాంతి కళాశాల సమీపంలో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వరాదని విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. బుధవారం కళాశాల కరస్పాండెంట్ దుత్త ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు కళాశాల ఎదుట రహదారిపై బైఠాయించి ఈ రోడ్లో రెండు బ్యాంకులు కళాశాల ఉన్నందున నిత్యం విద్యార్థులు ఖాతాదారులు సంచరించే ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. అందువల్ల ఈ ప్రాంత వాసులకు ఎదురయ్యే ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి తమ రోడ్లో ఏర్పాటు చేయబోతున్న మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

క్వారీ గండి పూడ్చాలని వినతి

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని పాపవినాశనం ఇసుక క్వారీకి వెళ్లే రహదారిలో మంగళవారం గండి కొట్టడంతో ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే చర్యలు చేపట్టాలని ఘంటసాల మండల తహసిల్దార్ బి.విజయప్రసాద్ కు ఆ గ్రామ ప్రజలు బుధవారం వినతిపత్రం అందజేశారు. కష్ణానది నుండి గ్రామానికి చెందిన పలువురు ఎడ్లబండ్లతో ఇసుక తెచ్చుకుని జీవనం సాగిస్తున్నారు. కష్ణానదిలో లంక భూములు ఉండటంతో సొసైటీ ప్రతినిధులు ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తున్నారనే నెపంతో ఎండ్ల బండ్లు నదిలోకి వెళ్లకుండా కష్ణా పుష్కరాలకు ప్రభుత్వం వేయించిన రోడ్డుకు భారీ గండి కొట్టడంతో గ్రామంలోనీ బీసీలు గొర్రెలు, మేకలు, పశువులను మేపుకునె వారికీ చాలా ఇబ్బందిగా మారిందన్నారు . జీవాలు మేత కోసం వెళ్లాలన్నా, రైతులు మేతకోసుకు రావాలన్న తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. అదేవిధంగా పాపవినాశనం పరిధిలోని పాపాయిలంక, బాపట్ల జిల్లా రావిలంకల్లో గ్రామానికి చెందిన జీవాలు మేపుకునే వారు

రూ.3 నుంచి రూ.5 లక్షలు వెచ్చించి పచ్చమేత పాటలు పాడుకుంటామని, అక్కడకు వెళ్లి రావడానికి ఉండే ప్రధాన రహదారి పై బారీ గండి కొట్టడం వల్ల వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం కష్ణానదిలో నీరు ఉండటం వల్ల పడవల సాయంతో లంకల్లోకి జీవాలను తీసుకెళుతున్నామని, నీరు తగ్గితే రాకపోకలు ఎలా చేయాలో తెలియడం లేదన్నారు. ప్రస్తుతం పశువులు, జీవాలు నీరు తాగడానికి కూడా దారి లేని పరిస్థితి ఏర్పడదంటూ ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే స్పందించి ప్రభుతం ఏర్పాటు చేసిన పుష్కరాల నాటి రోడ్డును గండికొట్టిన వారి పై చర్యలు తీసుకోవడంతో పాటు గండిపూడ్పించి దారి ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): చెడుపై మంచి.. రాక్షసులపై దేవతల విజయానికి ప్రతీక దీపావళి పండుగ అని అలాంటి దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ కొల్లు రవీంద్ర ఆకాక్షించారు. నూతన ఉత్తేజంతో రాష్ట్రం అభివృద్ధి బాటలో అడుగులు వేయాలని, ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి దైవ సహకారం ఉండాలన్నారు. దివ్వెల వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ ఏపిఎస్ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎంపి వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ డికె బాలాజీ ఎస్‌పి ఆర్.గంగాధరరావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- అవనిగడ్డ: మండల పరిధిలోని మోదమూడి గ్రామంలో ఉపాధి హామీ చట్టం నిధులు రూ 20 లక్షల తో నిర్మిస్తున్న నాలుగు సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ భూమిపూజ చేశారు. బుధవారం గ్రామ సర్పంచ్ బచ్చు బేబీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ చేసిన అనంతరం మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో ఎం మరియా దేవి ,జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషబాబు, బిజెపి మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఎంపీటీసీ కటికల వాసంత్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు నజీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

పెడన మున్సిపల్ కార్యాలయంలో దొంగతనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పెడన: పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన దొంగతనాలపై సంబంధిత అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీనియర్ కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు కమిషనర్ గోపాలరావును డిమాండ్ చేశారు. బుధవారం పురపాలక సంఘ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 17 అంశాలను ఆమోదించేందుకు ఎజెండా కాపీలో రూపొందించారు. ఈ సందర్భంగా పిచ్చిక సతీష్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఉండవలసిన ఎయిర్ కండిషనర్ గత మూడేళ్లుగా కనిపించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ పై విరుచుకుపడ్డారు. అంతేకాకుండా గత ఐదేళ్లుగా మున్సిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్ కూడా కనిపించడం లేదని వాటి ఆచూకీ గురించి వివరణ ఇవ్వాలని గోపాలరావును ప్రశ్నించారు. సతీష్ బాబుతో పాటు సీనియర్ కౌన్సిలర్‌లు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు, మట్ట శివ పావని లు కూడా ఈ అంశాన్ని లేవనెత్తారు. సమాచార


మాట్లాడుతున్న సతీష్‌బాబు

హక్కు చట్టం ద్వారానే తప్పుడు వివరణ ఇవ్వడంపై మున్సిపల్ ఏఈ రామాంజనేయులు, కమిషనర్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే మచిలీపట్నంలోని ఓ షోరూం నుంచి ఎయిర్ కండీషనర్ ఆటోలో మున్సిపల్ కార్యాలయానికి రావడం చర్చనీయాంశం అయింది. ఇంత జరిగిన మున్సిపల్ కమిషనర్ గోపాలరావు కౌన్సిల్ సభ్యులకు వివరణ ఇవ్వకుండా తన ఛాంబర్‌కు వెళ్లిపోవడంతో కౌన్సిల్ సభ్యులు త్వరలోనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం పంచాయతీ కార్మికుడు తుమ్మి ఏసుబాబుపై దాడిచేసిన మహమ్మద్ షబ్బీర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేశారు. దాడిలో గాయపడిన ఏసుబాబుకి మద్దతుగా

పారిశుధ్య పనులు నిలిపి వేసి న్యాయం కోసం రోడ్డు ఎక్కారు. ఏసుబాబుకి న్యాయం చేసే వరకు విధుల్లోకి వెళ్లమని చెప్పారు. అనంతరం పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులతో చర్చించారు. ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సెయింట్ ఆన్స్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మౌని పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు దీపావళి విశిష్టతను తెలుపుతూ దీపాలు వెలిగించి క్రాకర్స్

కాల్చి విద్యార్థులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బండి రామకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్, ఆర్కే గ్రూప్ సంస్థల అధినేత బండి రామకృష్ణ 60వ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి

అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరాస్ పేట సువర్ణ కళ్యాణ మండపంలో జరిగిన జన్మదినోత్సవ వేడుకల్లో బండి రామకష్ణ కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, గడ్డం రాజు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాబురావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-గన్నవరం: గ్రంథాలయాల సేవలను ప్రజలకు చేరువ చేయడంలో దొండపాటి బాబురావు కృషి ప్రశంసనీయమని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ తెలిపారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో బుధవారం ప్రథమశ్రేణి గ్రంథాలయ ఇన్చార్జ్ గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన దొండపాటి

బాబురావుకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు దంపతులను దుశ్శాలువాలతో సత్కారించారు. తహసీల్దారు కేవీ. శివయ్య, ఎంఈఓ కె. రవికుమార్, ఎంపీడీఓ స్వర్ణలత, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదరి తోట వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ: వరద బాధితులను ఆదుకున్న ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు ఆదర్శనీయంగా నిలిచాయని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదల వల్ల నష్టపోయిన బాధితులకు సహాయం చేసిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు ఆయా విద్యాసంస్థల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు టివిఎం రామదాసు, జివన్ బి.గోపాల్, వి.శ్రీనివాసరావు, క్రాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, విద్యానికేతన్ డైరెక్టర్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో కడుపులో బిడ్డ మృతి

గర్భిణీ పరిస్థితి విషమం - మైలవరం ప్రభుత్వాస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - మైలవరం : ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గర్భిణీ పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు ఆందోళన కు దిగిన సంఘటన బుధవారం రాత్రి మైలవరం ప్రభుత్వాసుపత్రి వద్ద చోటుచేసుకుంది. గర్భిణి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన కట్ట వరలక్ష్మి 9వ నెల గర్భిణీ. మొదటి కాన్పు మైలవరం ప్రభుత్వాసుపత్రిలోనే జరిగింది. మరల వరలక్ష్మికి మూడోనెల గర్భిణీ వచ్చినప్పటి నుండి ప్రభుత్వ ఆసుపత్రిలోని గైనకాలజిస్ట్ వద్ద పరీక్షలు చేయించుకుంటుంది. ఈనేపద్యంలో ఈనెల 25న వరలక్ష్మికి 9 నెలలు నిండాయి. మంగళవారం వరలక్ష్మిని పరీక్షించిన వైద్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలోనే ఉంచారు. బుధవారం ఉదయం 10 గంటలకు వరలక్ష్మి కడుపులో బిడ్డ చనిపోయాడని వైద్యులు చెప్పారన్నారు. బిపి ఎక్కువగా ఉండటం వల్ల బిడ్డ చనిపోయినట్లుగా వైద్యులు చెప్పారని బంధువులు ఆరోపిస్తున్నారు. బుధవారం రాత్రి వరలక్ష్మి కూడా సీరియస్ గా ఉందని విజయవాడ తీసుకెళ్లమని వైద్యులు చెప్పటంతో రాత్రిపూట తాము ఎక్కడికి తీసుకువెళ్లాలని ఆందోళనకు దిగారు. అత్యవసర సర్వీస్ నెంబర్లకు ఫోన్ చేసినా స్పందించలేదని వాపోయారు. పోలీసులు వచ్చినా తమగోడు వినలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ప్రైవేట్ అంబులెన్స్‌లో వరలక్ష్మిని విజయవాడకు తరలించారు.

గర్భిణతో ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

నందిగామ ట్రాన్స్‌కో ఎడి రమేష్ బాబు మృతి

ప్రజాశక్తి - నందిగామ

నందిగామ విద్యుత్ శాఖలో ఏ.డి గా విధులు నిర్వహిస్తున్న వి.రమేష్ బాబు(49)అకస్మాత్తుగా చాతి నొప్పితో మతి చెందారు. మంగళవారం రాత్రి ఛాతీ నొప్పితో మతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు వెల్లడించారు. రమేష్ బాబు కు భార్య పిల్లలు వున్నారు. రమేష్ బాబు మతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తోటి అధికార సిబ్బంది ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబనికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాఠశాలలో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి - వీరులపాడు : ప్రజాశక్తి వీరులపాడు పొన్నవరం గ్రామంలో ఏకత్వ ఇంటర్నేషనల్ పాఠశాలలో: ఘనంగా దీపావళి సంబరాలు అందులో భాగంగా సాంస్కతిక కార్యక్రమాలతో అందరినీ అలరించిన విద్యార్థిని విద్యార్థులు. వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వ పబ్లిక్ స్కూల్లో ఘనంగా దీపావళి సంబరాలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడప నాగ సూర్యవతి బుధవారం తెలిపారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - విస్సన్నపేట : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా, మండల కమిటీ విస్సన్నపేట విద్యారంగ సమస్యలు ఫీజు బకాయిలను విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న అమ్మఒడి, విద్య దీవెన,వసతి దీవెన విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ విస్సన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చిమట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవన నిధులు రూ.3,480 కోట్లు అమ్మఒడి పెండింగ్లో ఉంచిందని దీని వల్ల చదువులు పూర్తిచేసిన విద్యార్దులు సర్టిఫికేట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో గత ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ నాయక్ మాట్లాడుతూ హాస్టళ్ళ పరిస్థితి రోజురోజుకూ దిగజారి పోతుందని, సొంత భవనాలు లేకపోవడంతో చాలిచాలని వసతులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంబేద్కర్ సెంటర్ నుండి మండల తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లి మండల తహశీల్దార్ కె.లక్ష్మి కళ్యాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు విస్సంపల్లి.నాగరాజు, కెవిపిఎస్ జిల్లా నాయకులు జ్ఞానరత్నం, మండల కార్యదర్శి పెద్దబాబు, అధ్యక్షులు విశాల్, మండల నాయకులు కిషోర్, గోవర్దన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సమస్యల పరిష్కారం కోరకు జెన్ కో యం.డి, కాలుష్య ప్రభావిత ప్రాంత ప్రజల, ప్రజా ప్రతినిధులతో గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ నాగరాజుకు కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట గళ ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కన్వీనర్ పసుమర్తి వెంకట సుబ్రహ్మణ్యం, సభ్యులు, కలిసి వినతిపత్రం అందజేశారు. ఇకపై కాలుష్య ప్రభావిత ప్రాంతాల పరిశీలన కోసం జన్ కో, ప్రభావిత ప్రాంతాల ప్రజలతో జాయింట్ పర్యవేక్షణ అమలుకు ఏర్పాటు చేయాలని కోరగా, ప్రతిపాదనకు అంగీకరించిన సిఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లు శుక్రవారం కలెక్టర్‌కు చెక్కు అందజేస్తామని, ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ నాగరాజు, పరిపాలన పర్యవేక్షణ ఇంజనీర్, డిప్యూటీ సెక్రటరీ, సివిల్ పర్యవేక్షణ అధికారులు, సెక్యూరిటీ అధికారులు, సామాజిక కార్యకర్త నల్లమోతు ప్రసన్న బోస్, జనసేన మండల అధ్యక్షులు తుమ్మలపాలెం ఎంపీటీసీ పోలిశెట్టి తేజ, సిపిఎం మండల కార్యదర్శి ఎం.మహేష్, ఎ.విఠల్ రావు, గుంటుపల్లి రైతు నాయకులు సిహెచ్ వేణు గోపాల్, యం సిపిఐయు నాయకులు జి.ప్రసాద్, కె.బసవయ్య పాల్గొన్నారు.

స్కిల్ సెన్సస్ ట్రైనింగ్ కార్యక్రమం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్కిల్ సెన్సస్ (నైపుణ్య అవగాహన)పై ప్రత్యేక శిక్షణా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎంపిడిఒ సునీత శర్మ ఆధ్వర్యంలో జరిగింది. అధికారులు నవంబర్ 1 నుండి 30 వరకు ప్రతి ఇంటి నుండి 15-59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారి నైపుణ్యాలను గుర్తించి నమోదు చేయాలి. ఈ సర్వే ద్వారా గుర్తించిన వారికి వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి తగిన మార్గదర్శకాలు, శిక్షణ ఇస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సర్వేయర్లు, విఆర్ఓలు పాల్గొన్నారు.

కొండ ప్రాంత సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ పర్యటనలో భాగంగా గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు బుధవారం పర్యటించారు. మంజూరైన రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులు చేపట్టాలని, కాలువలు, మెట్లు ల్యాండింగ్ రిపేర్లు చేయించాలని, అలాగే వీధి కుక్కలను నియంత్రించాలని, తదితర సమస్యలను ప్రజలు కార్పొరేటర్ సత్యబాబు వద్ద వాపోయారు. సమస్యలను విఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని సత్యబాబు వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో శానిటేషన్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

'లిటిల్ బ్రెయిన్'లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో దీపావళి వేడుకలు బుధవారం అంగ రంగా వైభవంగా జరిగాయి. సిద్ధార్థ నగర్‌లోని పాఠశాలలో విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, ఒకరినొకరు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఫణి ప్రసాద్ ముక్తేవి మాట్లాడుతూ దీపావళి అంటే పిల్లల పండుగ అని, ఈ పండుగ అంటే పిల్లలకు ఎంతో ఇష్టమని, పండుగ ఎపుడు జరుపుకోవాలని ఎదురుచూస్తుంటారన్నారు. ముఖ్యంగా పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగ విశిష్టత తెలియచేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. అంత కంటే ముఖ్యంగా పండుగ రోజు ఇంటి వద్ద టపాసులు కాల్చే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వైజాగ్‌కు చెందిన టెక్నోడైన్ ఇన్ఫర్మాటిక్స్ కంపెనీ లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్ తెలిపారు. బుధవారం కలాశాలలోకంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు కళాశాల బి టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వ్రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 23 మంది విద్యార్థులను కంపెనీ తరుపున ట్రైనీ సాఫ్ట్ వేర్ ఇంజినీర్స్‌గా 4.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసి వారికి నియామక ఉత్తర్వులు అందచేశారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ కరెస్పాండంట్ కె.రామ మోహన్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

స్టాల్స్‌కు ప్రత్యామ్నాయ స్థలం చూపాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన క్రాకర్స్ స్టాల్స్ తడిసిపోయాయి. లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన మందుగుండు సామాను తడిచిపోవటంతో చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. స్టాల్స్ ఏర్పాటుకు ప్రయత్యామ్నాయ స్థలం చూపాలని కోరుతున్నారు.

సొరకాయపై వల్లభాయ్ పటేల్ చిత్రం

జగ్గయ్యపేట: సర్దార్ వల్లభాయ్ పటేల్ సందర్భంగా పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ 15 అంగుళాల సొరకాయపై బ్లాక్ మార్కర్ పెన్నుతో, చార్ట్ పేపర్ పై పెన్సిల్, పెన్సిల్ షేడ్స్‌తో అద్భుతంగా చిత్రీకరించారు.

గోద్రెజ్ రాషిన్‌బాన్‌తో మిరప రైతులకు భరోసా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మిరప మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయ పరిష్కారాలను రైతులు స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ, పూత సమయం అంటే రాషిన్‌బాన్ సమయమని జిఏవిఎల్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ ఎన్.కె.రాజవేలు పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. మొక్క నాటిన 45-75 రోజుల వద్ద రాషిన్‌బాన్ ఉపయోగించినప్పుడు, సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఇది ఒకసారి వినియోగిస్తేనే తామర పురుగు (త్రిప్స్), లెపిడోప్టెరాన్స్, పచ్చ దోమ (హాప్పర్స్), నల్లి (మైట్స్)తో సహా అనేక రకాల కీటకాలను నాశనం చేస్తుంది అని తెలిపారు.

రాష్ట్ర పోటీలకు కొండపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎస్‌జిఎఫ్ విభాగంలో జరిగిన ఆటల పోటీల్లో కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. వాలీబాల్ 17 సంవత్సరాల విభాగంలో ఎల్ కీర్తన, అనంతపురం జిల్లా హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నది 14 సంవత్సరాల విభాగంలో సిహెచ్.సుప్రియ, జె.హేమాదేవి ఎంపిక కాబడ్డారు. స్టాండ్ బై గా నాగదీపిక విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారు. అథ్లెటిక్స్ విభాగంలో కె.వి.జాహ్నవి డిస్కస్ త్రో, బి.జాహ్నవి, హేమర్ త్రో, హై జంప్ విభాగంలో ఎస్.కీర్తి, జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అథ్లెటిక్స్ విభాగంలో ఎంపికయ్యారు.

తప్పులు సరిచేయాలని దరఖాస్తులు

ప్రజాశక్తి - వీరులపాడు : పట్టాదార్ పాస్ పుస్తకాల్లో తప్పులు సరిదిద్దాలని తహశీల్దార్‌కు 48 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వి.అన్నవరం గ్రామంలో రెవెన్యూ రీ సర్వే గ్రామ సభలో ఈ దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలంలో వి.అన్నవరం గ్రామంలో రెవెన్యూ భూముల రీ సర్వే సంబంధించిన సరిహద్దు భూముల రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకాలపై తప్పులు సరి దిద్దాలని దరఖాస్తులిచ్చారు. తహశీల్దార్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన భూములకు చిన్న సవరణ చేయించుకోవాలని తెలిపారు.

జాబ్ మేళా

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ఎ.పీ. ఎన్జీవో హోమ్ లో జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో మొత్తం 52 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వరుణ్ మోటార్స్ .. 2, ఎస్ బి ఐ పేమెంట్ .. 13 మరియు ఫ్లిప్కార్ట్ .. 12 మందిని సెలెక్ట్ చేసి 11 మందిని షార్ట్ లిస్టు చేసినట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ బాబు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.